# పుట్టిన రోజు పండుగ

పాలకూర సీతాలత

ఆరోజు ఆఫీసులో లంచ్ బ్రేక్ సమయంలో మా కొల్లీగ్ లంబోదరం అన్నాడు. రేపు సాయంత్రం మీరంతా మా ఇంటికి రావాలి. మా భూమి పుట్టినరోజు సందర్భంలో పార్టీ ఇస్తున్నాను."

సరిగ్గా క్రితం సంవత్సరం వాడు ఇలాగే అనడం, మేమంతా పొరపాటుపడి వాడు తన కూతురు పుట్టిన రోజు జరుపుతున్నాడనుకుని ప్రజంటేషన్లు తీసుకువెళ్లడం, తీరాచూస్తే వాడు ఆ పార్టీ ఆంధ్రభూమి జన్మదిన సందర్భంగా ఇస్తున్నాడని తెలియడం అన్నీ గుర్తు వచ్చాయి.

అందుకే ముందే అడిగేశాను. " ఏరా భూమి అంటే "ఆంధ్రభూమేనా?"

" ఈ విషయం ముందుగా తెలుసుకోవడం మంచిదికదా. లేకపోతే అనవసరంగా ప్రజంటేషన్ కొనడం ఎందుకు?"వాడు చిరునవ్వుతో మెచ్చుకోలుగా నావైపు చూశాడు.

ఒరేయ్ ప్రసన్న వదనం "ఎలాగైనా నీ జ్ఞాపకశక్తి చాలా పదునురా" పదునా? ఆశ్చర్యపోయాను. "అదే .. షార్ప్..." అంటూ వివరించాడు. "పొద చుట్టూ కొట్టకు నా ప్రశ్నకు జవాబు చెప్పు" అన్నాను.

ఈసారి వాడు ఆశ్చర్యపోయాడు.

"పొద చుట్టూ కొట్టడమా?"

"అదేరా... డోంట్ బీట్ ఎరౌండ్ ది బుష్..." అంటూ నేను వివరించాను. వాడు గట్టిగా నవ్వేశాడు.

నా అనుమానం నిజమే వాడు ఆ పార్టీ ఆంధ్రభూమి జన్మదిన సందర్భంలోనే ఇస్తున్నాడు. ఆంధ్రభూమి అభిమాన సంఘం ప్రెసిడెంటు కదా మరి... ఏమైతేనేం ఏదన్నా పార్టీ అంటే ముందు ప్రజంటేషన్ కోసం కొంత చమురు వదుల్తుంది. ఈ పార్టీలో ఇదే లాభం... చమురు ఖర్చులేదు. తప్పకుండా పార్టీకి వస్తామని అందరం ప్రామిస్ చేశాం.

"కొంపలో పెళ్లాందో, పిల్లలదో పుట్టిన రోజు రావడంకంటే ఇలా వారపత్రిక పుట్టిన రోజువస్తే బెస్టు. ఖర్చు వుండదు. మామూలు సంచిక కంటే బహుశా ఒకరూపాయి ఎక్కువ ఖర్చు పెట్టాలి పుస్తకం కోసం. అయితేనేం. బోలెడు పేజీలతో చక్కని శీర్షికలతో బహుమతి,పొందిన కథలతో మంచి విందు చేస్తుంది ఆ పుస్తకం" అన్నాడు మరో కొలీగ్ ఉబ్బావధాన్లు. "ఇంట్లో వాళ్ల పుట్టినరోజు వస్తే మాత్రం ఏమంత పెద్ద ఖర్చురా?" అన్నాను నేను ఊరుకోలేక.

"మీ ఆవిడ మంచిది కనుక ఊరుకుంటుందేమో కానీ తన పుట్టిన రోజు వస్తే జరీచీర కొని తీరాలంటుంది మా ఆవిడ. అంత ఖర్చు తట్టుకోలేనని బ్రతిమాలితే ఒక్కొక్కసారి ఊరుకుంటుంది. అయినా కొనే చీర ఖరీదు నూట యాభైకు తక్కువ వుండరాదు." అన్నాడు ఏడుపుముఖంతో ఉబ్బావధాన్లు.

"బాగుందిరా. పెళ్లామూ, పుస్తకమూ ఒకటేనా? రెండింటినీ పోల్చడం బాగోలేదు. పెళ్లాంచేసే పనులన్నీ పుస్తకం చేస్తుందా?" అన్నాను కోపంగా.

లంబోదరం అన్నాడు నాతో.

"అదేమిట్రా... ఒక్కసారిగా ఆడవాళ్లను సపోర్టు చెయ్యడం మొదలు పెట్టావు. నువ్వుకూడా తరుచు మీ ఆవిడ గురించి మాతో చెప్పుకుని ఏడుస్తూ వుండేవాడివికదా ఖర్చు ఎక్కువగా పెట్టేస్తోందనీ, అప్పులపాలు అయిపోతున్నాననీ... నీ ధోరణి ఇలా మారిపోయిందేమిటి కథ. సినిమాలో ఆఖరి సీన్లో విలన్ మంచివాడుగా మారిపోయినట్లుగా వుంది నీ వ్యవహారం."

తలవంచుకున్నాను. ఎందుకంటే లంబోదరం మాటల్లో నిజం లేకపోలేదు.

"మా ఆవిడ తాలూకు అమ్మమ్మ చనిపోతూ తనకున్న లక్షలాది ఆస్తీ తన ఏకైక మనుమరాలైన మా ఆవిడకు ఇచ్చి ఈ మధ్యే కన్ను మూసింది. అప్పట్నుంచే నేను మా ఆవిడను దేవతలా చూడ్డం మొదలు పెట్టాను. ఈ విషయం వీళ్లకు చెప్పలేదు... చెప్తే ఎక్కడ పార్టీ అడుగుతారో అన్న భయంతో. "

" ఇప్పుడూ చెప్పను." అందుకే అన్నాను.

"ఆడవాళ్లను గౌరవించని వాడు మనిషికాదురా... వాళ్లూ మనలాంటి మనుషులే... వాళ్లలోనూ రక్తమాంసాలు వున్నాయి. వాళ్లకూ మానాభిమానాలు, కోపతాపాలు.." ఇంకా చెప్తుంటే అడ్డువచ్చాడు ఉబ్బావధాన్లు.

"చాలు" ఇక సుత్తి వెయ్యకు.."

నోరు మూసుకోక తప్పలేదు మరి.

"కొంతమంది ఈ పుట్టిన రోజు పార్టీలు కేవలం ప్రజంటేషన్లకోసమే చేస్తారు..." అన్నాడు ఉబ్బావధాన్లు. నెలరోజుల క్రితం తన కొడుకు పుట్టిన రోజు ఇందుకోసమే పార్టీ ఇచ్చి జరిపించాడు వాడు మరి.

"పక్కవాడు ఖర్చు భరించడానికి సిద్ధపడితే ప్రతీరోజూ పుట్టిన రోజు జరుపుకుందుకు సిద్ధం నేను..." అన్నాను. అలా అంటున్నపుడు నిర్మాత ఖర్చుతో సెట్‌మీద పుట్టినరోజు వేడుకలు జరుపుకునే సినిమా తారలు గుర్తువచ్చారునాకు.

"ఏడవ లేక పోయావ్." అన్నాడు లంబోదరం. ఉబ్బావధాన్లు అన్నాడు.

"పుట్టిన రోజు అంటే గుర్తుకు వచ్చింది. మా తాతయ్య పుట్టిన రోజునే మా తమ్ముడు పుట్టాడు. ఆ విషయం తెలిసిన మా తమ్ముడు మా తాతయ్యతో "తాతా..అయితే మనం కవల పిల్లలమా?" అని అడిగేడు.

ఆ జోక్‌కి నవ్వు వచ్చింది అందరికీ.

"ఇక కబుర్లు చాలు... పని చెయ్యండి." అంటూ హుంకరించాడు మా బట్టతల సెక్షనాఫీసరు.

ఆయనంటే మాకు భయం లేదు కానీ గౌరవం వుంది.

అందుకే ఇక కబుర్లు ఆపి పనిలో పడ్డాం.

సాయంత్రం ఆఫీసు అయి విడిపోతుంటే లంబోదరం మళ్లీ గుర్తుచేశాడు రేపటి పార్టీగురించి.

'వెధవ టీపార్టీలు తరుచు జరుగుతూ వుండేవే. ఈ లంబోదరంగాడు రేపు మందుపార్టీ ఇస్తే బాగుండును... అనుకున్నాను మనసులో

* * *

ఆ మర్నాడు సాయంత్రం లంబోదరం చెప్పిన వేళకు మిత్రులందరం వాడి ఇంటికి వెళ్ళాం. అందర్నీ సాదరంగా ఆహ్వానించాడు. లెక్చర్ ఇచ్చాడు.

"ఫ్రెండ్స్..గత సంవత్సరం నేను ఇదే సందర్భంలో మీకు పార్టీ ఇచ్చిన విషయం మీకు గుర్తువుందనుకుంటాను. ఈ సంవత్సరం మళ్ళీ ఇస్తున్నాను. ఆంధ్రభూమి వారపత్రిక జన్మదిన సందర్భంలోఈ ఏడాదిలో ఆంధ్రభూమి ఏం సాధించిందో మీకు తెలుసా?"

"తెలుసు..తెలుసు...అన్నాం అందరం ముక్తకంఠంతో.

అయితే ఇంకేం?..." నాకు భ్రమతప్పింది. అన్నీ తెలిసిన మీకు చెప్పవల్సింది ఏముంది?" అన్నాడు.

**కొంపలో పెళ్లాందో, పిల్లలదో పుట్టినరోజు రావడంకంటే ఇలా వారపత్రిక పుట్టినరోజు వస్తే బెస్టు. ఖర్చు వుండదు. మామూలు సంచికకంటే బహుశా ఒక రూపాయి ఎక్కువ ఖర్చు పెట్టాలి పుస్తకంకోసం. అయితేనేం...**

నిరాశపడ్డాం. వాడిచేత ఇంకా మాట్లాడించాలని వుంది మాకు. కానీ మేం తెలుసు అనేసరికి వాడు తన లెక్చర్ ఆపేశాడు. అందుకే మాలో మేము కూడ బలుక్కుని కొందరం "తెలుసు" అనీ, కొందరం "తెలియదు" అనీ అన్నాం.

"అయితే నా పని ఇంకా సులువు అయ్యింది. తెలిసిన వాళ్లందరూ తెలియనివాళ్లకు చెప్పండి. మధ్యలో నాకు ఎందుకు శ్రమ?" అన్నాడు.

తెల్లబోయాం. వీడికి ఇన్ని తెలివితేటలు ఎలా వచ్చాయా అని ఆశ్చర్యపోయాం. వాడిచేత ఎలాగైనా మాట్లాడించాలన్న పట్టుదల మాకు ఎక్కువయ్యింది. మళ్లీ మేమందరం కూడబలుక్కున్నాం.

"లంబోదరం నువ్వు అన్న మాటలుసరిగ్గా అర్థంకాక మేం అలా అన్నాం. మాలో ఎవ్వరికీ ఆ విషయం గురించి తెలియదు. అందుకని నువ్వే వివరంగా చెప్పు" అన్నాను.

"ఒరేయ్ ప్రసన్నవదనం! నీ ట్రిక్కులు నామీద ప్రయోగించకు. మీ అందరికీ నిజంగా తెలియకపోతే మీరందరూ వట్టి బడుద్దాయిలని అర్థం. అలాంటి తెలివి తక్కువ దద్దమ్మలకు నేను ఎంత చెప్పినా అర్థంకాదు. అందుకని నేను చెప్పను." అన్నాడు.

నిజం చెప్పాలంటే మా ముఖంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేకుండా పోయింది. వీడు ఇంత తెలివిగా ఎలా మాట్లాడగలుగుతున్నాడా అని తన్నుకువచ్చినా తెలియలేదు. "ఒరేయ్..ది సీజ్ నాట్ మర్యాద.. ఇది మర్యాదకాదు. పార్టీ కంటూ ఆహ్వానించి వచ్చిన అతిథి మహాశయులందర్నీ తెలివి తక్కువ దద్దమ్మలు అంటూ పిలవడం సభా మర్యాదకాదు", అన్నాను కోపంగా.

సరిగ్గా అప్పుడే నా కంటికి బీరుకాయలు, విస్కీకాయలు కనపడ్డాయి. అయితే నేను ఆశపడ్డట్లు వీడు నిజంగా మందు పార్టీ ఇస్తున్నాడా నా కోపం అంతా చల్లారిపోయింది.

"ఫ్రెండ్స్..క్రితంసారి కేవలం టీపార్టీ ఇచ్చాను. ఈసారి మందు పార్టీ ఇస్తున్నాను. ఎందుకంటే ఈసారి ఆంధ్రభూమి జన్మదిన సంచికలో మొదటి బహుమతి వచ్చిన కథ నాదే...." అన్నాడు లంబోదరం.

మేం నోరు వెళ్లబెట్టాం.



లంబోదరంగాడు కథరాయడమా... దానికి బహుమతి రావడమా?

"ఏరా నీకు ఉత్తరం రాయటమే సరిగ్గారాదు... అలాంటిది... మొదటి బహుమతి వచ్చేంత గొప్పగా కథ రాశావా మేం నమ్మం.." అన్నాను.

మాకు పంచిపెట్టడం కోసం తెప్పించి పెట్టిన జన్మదిన సంచికలు అక్కడే వున్నాయి. అందరికీ తలోకటీ ఇచ్చాడు. ఆత్రంగా తెరిచి చూశాం. వాడు చెప్పింది నిజమే కానీ ఆ నిజం జీర్ణంచేసుకుందుకు ఒక నిముషం పట్టింది.

"ఏం ఇంకా నమ్మకం కలగలేదా?" గర్జిస్తున్నట్లు అన్నాడు లంబోదరం.

నమ్మక ఛస్తామా... అందులో పడ్డవాడి ఫోటో పరిచయం.

"ఒరేయ్... ఈ ఫోటోలో నీ పోలికలు వున్నాయికానీ ఇందులో నువ్వుచాలా యంగ్‌గా వున్నావు. బాగా పాత ఫోటోనా?" అన్నాను.

"అవున్నా పెళ్లి చూపులానాటి ఫోటో. ఇప్పుడు నాకు బట్టతల, బొజ్జ, కళ్లజోడు వచ్చేసింది. లేటెస్టు ఫోటో బాగుండదని పాత ఫోటో పంపాను." అన్నాడు. అందరం వాడిని కంగ్రాచ్యులేట్ చేశాం.

ఆ తర్వాత సీసాలు ఖాళీ చెయ్యడం మొదలుపెట్టాం.

"ఒరేయ్... నీకు కథలు రాసేంత తెలివి ఎక్కడనుంచి వచ్చింది? చెప్పు" అన్నాను "ప్రసన్నవదనం" అనవ సరంగా అసూయపడిపోకు కథలు రాయడం చాలా కష్టం అని గతంలో నేనూ అనుకునే వాడిని రాసేందుకు ఓపిక, సమయం వుండాలి కానీ కథలు ఎవరైనా రాయవచ్చు. నిజ జీవితంలో మనం ఎన్ని కథలు అల్లటం లేదు? అవే కాగితం మీద పెట్టాలి. అంతే పేకాటఆడి ఆలస్యంగా ఇంటికి వెళ్లిన రోజున పెళ్లాం నిలదీసి అడిగితే నోటికి వచ్చిన కథ అల్లి చెప్పటంలేదా మనం? శెలవు ఎందుకు పొడిగించావని డ్యూటీలో చేరిన రోజున ఆఫీసరు గద్దించి అడిగితే కథ అల్లి చెప్పటం లేదా మనం? అంత ఎందుకు రోడ్డుమీద ఒక అబ్బాయి, అమ్మాయి కలిసి వెళ్తుంటే... వాళ్ళు అన్నా చెల్లెళ్లు అయినాసరే... వాళ్లిద్దరి మధ్య అక్రమ సంబంధం వుందని కథలు అల్లి ప్రచారం చెయ్యటంలేదా మనం. చెప్పండి. ఇన్నేసి కథలు అల్లుతున్న మనకు పుస్తకాల్లో కథలురాయడానికి అడ్డు ఏమిటి? పైగా కాస్తంత పేరు, కొద్దిపాటి రాబడీ కూడా వస్తుంది. ఏమంటారు?"

వాడి ముఖంలోకి ఆశ్చర్యంగా చూశాను. వాడు చెప్పింది నిజమే. వాడు చెప్పిన వెధవపన్లు అన్నీ నేనూ చేస్తున్నాను. ఇప్పుడు కూడా కడుపారా తాగి ఇంటికివెళ్తే మా ఆవిడ ఎక్కడ పసిగడుతుందో అన్న భయంతో ఈ రాత్రంతా ఏ బ్రహ్మచారి మిత్రుడి గదిలోనో గడిపి ఆఫీసులో ఓవర్ టైం చేస్తున్నానని చెప్పాలని నేను ఎప్పుడో నిర్ణయించుకున్నాను.

అయితే వాడు చెప్పినట్లు నేను కూడా కథలు రాయగలనా?

"ఎంజాయ్ ఫ్రెండ్స్... నో లిమిట్స్..." అన్నాడు లంబోదరం. వాడు గొప్ప ఉత్సాహంగా వున్నాడు. వాడిచ్చిన ప్రోత్సాహంతో నేను మరింత విజృంభించాను.

తాగుతున్నాను. కళ్ళు వాలిపోతున్నాయి.. మనసులోని కోరిక గట్టిపడుతోంది. ఏమిటాకోరిక అని అడుగుతున్నారా?



లాభం

వయోజన విద్య నేర్పటం వల్ల కలిగే లాభాలేంటి? "అడిగాడు వేణుగోపాల్ గోపాలాన్ని.

"సెక్స్ పుస్తకాలు బాగా అమ్ముడుపోతాయి" చెప్పాడు గోపాలం.

—కె.భూపతి (తిరుమల)

ఏంలేదు. నిజ జీవితంలో కథలు అల్లగలిగే నేను కాగితంమీద ఒక కథరాసి ఆంధ్రభూమికి పోటీకి పంపాలి. ప్రైజు కొట్టాలి.

సాధ్యమేనా?... ఆ... ఎందుకు కాదు..

"కృషితోనాస్తి దుర్భిక్షం..." అని పెద్దలు అనలేదా?

కథ రాస్తాను... స్తాను...ను...

పోటీకి పంపుతాను..పుతాను..తాను..ను...

ప్రైజు కొడతాను...డతాను.. తాను.. ను...

హహ్హహ్హ...హహ్హ..హ్హ

*




